అంబేద్కర్ విగ్రహావిష్కరణకు స్పీకర్‌కు ఆహ్వానం

కులకచర్ల, ఏప్రిల్ 12 : అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శుక్రవారం కులకచర్ల మండల నాయకులు కలిశారు. ఈ నెల 28న మండల పరిధిలోని పుట్టపహాడ్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మండల దళిత యువశక్తి యువజన సంఘం అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు రవీందర్‌నాయక్, దళిత సంఘం నాయకులు లాలు, పుట్టపహాడ్ శ్రీరాములు, డి శ్రీనివాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల తలంబ్రాల పంపిణీ పోస్టర్ ఆవిష్కరణ

పరిగి, ఏప్రిల్ 12: శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ భద్రాద్రి సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాల పంపిణీ కార్యక్రమ పత్రికను శుక్రవారం పరిగిలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. భద్రాద్రి శ్రీ సీతారాముల వారి తలంబ్రాలు కావాల్సిన వారు రూ.151 చెల్లిస్తే వారికి అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ లాజిస్టిక్స్ అధికారి విశ్వనాథ్‌గౌడ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వీధి నాటక కళాకారులకు ఎమ్మెల్యే చేయూత

యాలాల, ఏప్రిల్ 12: మండల పరిధిలోని ముద్దాయిపేటలో గురువారం రాత్రి లక్ష్మీచెన్నకేశవ స్వామి వీధి నాటకాన్ని ప్రదర్శించారు. తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నాటకాన్ని ప్రదర్శించిన కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రూ.10,111 నగదును శ్రీనివాస్ గౌడ్ ద్వారా అందించారు. ఈ సందర్భంగా కళాకారులు రోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కృష్ణయ్య గౌడ్, బిచ్చయ్య గౌడ్, ఆసిఫ్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

బొంరాస్‌పేట, ఏపిల్ 12 : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన బొం రాస్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తూరులో శుక్రవారం ఉదయం జరిగింది. ఎస్సై అబ్దుల్ రవూఫ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్ద కురువ నర్సింహులు(48) గురువారం రాత్రి భార్య, కొడుకుతో కలిసి భోజనం చేసి ఇంట్లో పడుకున్నాడు. శుక్రవారం ఉదయం 7 గంటలకు చూస్తే పడుకున్నచోటే మృతి చెంది ఉన్నాడు. కొడుకు ఆకాష్ నాయనమ్మకు విష యం తెలుపగా కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించగా అనుమానం వచ్చింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుడి కన్ను కింద గాయం ఉంది. తల్లి అంజిలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవూఫ్ తెలిపారు.

పోలీసుల కౌన్సెలింగ్‌తో బాల్య వివాహం వాయిదా

తాండూరు రూరల్, ఏప్రిల్ 12 : తాండూరు మండలం, కొత్లాపూర్ గ్రామానికి చెందిన ఓ బాలికతో మల్కాపూర్ గ్రామానికి చెందిన యువకుడితో బంధువులు పెండ్లి చేసేందుకు నిర్ణయించారు. కరణ్‌కోట పోలీసులు ఇరువురు బంధువులను పోలీసు స్టేషన్‌ను పిలించారు. బాలికను పెండ్లి చేసుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై విఠల్‌రెడ్డి హెచ్చరించారు. 18 ఏండ్లు నిండిన తర్వాతనే అమ్మాయికి పెండ్లి చేయాలని బంధువులకు పోలీసులు సూచించారు. అబ్బాయి తరపు బంధువులకు కూడా కౌన్సెలింగ్ ఇచ్చారు. దాంతో పెండ్లి నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు ఇరువురు బంధువులు తెలిపారు.

బెట్టింగ్‌కు అలవాటుపడి..

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 12: బెట్టింగ్‌లకు పాల్పడిన ఓ వ్యక్తి ఆర్థికంగా నష్టపోయాడు. ఇటీవల జరిగిన ఓ రోడ్డు ప్రమాదం కూడా అతడిని మరింత ఇబ్బందికి గురి చేసింది. దీంతో జీవితంపై విరక్తితో అతడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్ బషీరాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లాకు చెందిన కమ్మరి మహిపాల్ (39) కొద్ది రోజుల కిందట తన భార్యతో కలిసి నగరానికి వలసొచ్చి కుత్బుల్లాపూర్‌లోని భాగ్యలక్ష్మి కాలనీలో ఉంటున్నాడు. వృత్తిరీత్యా ప్రైవేట్ టీచర్. అతడి భార్య ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నది. మహిపాల్‌కు బెట్టింగ్‌కు బానిసయ్యాడు. ఇటీవల తాను ఉంటున్న ప్రాంతం నుంచి స్కూటీపై వెళ్తూ ఓ నాలుగేళ్ల బాలుడిని ఢీ కొట్టాడు. బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. భయాందోళనకు గురైన అతడు తన సొంతూరుకు వెళ్లాడు. బాలుడి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొని, సమస్యను పరిష్కరించుకునేందుకు తిరిగి వచ్చాడు. ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న అతడిని.. బాలుడి విషయం తీవ్ర మనస్తాపానికి గురి చేసింది. గురువారం సాయంత్రం అతడి భార్య ఆఫీస్‌కు వెళ్లిన సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి బకెట్‌లో పడి బాలిక మృతి

జీడిమెట్ల, ఏప్రిల్ 12: ఆడుకుంటూ ఓ బాలిక నీటి బకెట్‌లో పడి మృతి చెందింది. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చింతల్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన సుధాకర్ ప్రైవేటు ఉద్యోగి. అతడి భార్య బిందు శుక్రవారం మధ్యాహ్నం ఇంటిలో పనిలో ఉండగా.. కుమార్తెలు ఐదేళ్ల ఆధ్య, రియా(1) ఆడుకుంటున్నారు. కొంతసేపటి తర్వాత తల్లి గమనించగా.. రియా నీటి బకెట్‌లో పడిపోయి కనిపించింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాలికను చింతల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

భవనం పైనుంచి పడి కూలీ మృతి

శామీర్‌పేట, ఏప్రిల్ 12 : భవనం పైనుంచి పడి పెయింటర్ మృతి చెందాడు. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం.. శామీర్‌పేట గ్రామానికి చెందిన భిక్షపతి (46) పెయింటర్. శామీర్‌పేటలోని ఒక సంస్థ భవనం రెండో అంతస్తులో గురువారం అతడు పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు తాడు తెగిపోవడంతో భవనం పైనుంచి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పేకాట ఆడుతున్న 9 మంది అరెస్టు

సిటీబ్యూరో/మాదాపూర్, ఏప్రిల్ 12: పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని మాదాపూర్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మాదాపూర్ చందానాయక్ తండాలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అక్రమంగా గ్యాబ్లింగ్ అడ్డాను నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఎస్ఓటీ, మాదాపూర్ పోలీసులు కలిసి దాడులు జరిపి నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. పట్టుబడిన నిందితుల వద్ద నుంచి రూ.2,71,500 నగదు, 9 సెల్‌ఫోన్లు, 2 సెట్ల పేకాట కార్డులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు

పరిగి: వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న ఎస్ఐ సంతోష్

కులకచర్ల: వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 12: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా శుక్రవారం పరిగిలో పోలీసులు విస్తృ తంగా వాహనాల తనిఖీ చేపట్టారు. పట్టణం లోని టెలిఫోన్ ఎక్స్చేంజ్ ముందు జాతీయ రహ దారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలను పరిగి ఎస్ఐ సంతోష్ నేతృత్వంలోని పోలీసు బృందం తనిఖీలు నిర్వహించారు. ప్రైవేటు వాహనాలు మొదలుకొని ఆర్టీసీ బస్సుల్లో సైతం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

కులకచర్ల : కులకచర్ల మండల కేంద్రంలో ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల్లో భాగంగా వాహనాల్లో డబ్బు, ఇతర వస్తువులను తరలించకుండా ఉండేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. దీనికి గాను ప్రతి రోజు మండల పరిధిలో తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు అనుమానమున్న వాహనాలన్నింటినీ తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాలాను తిరిగి తవ్వించిన అధికారులు

నవాబుపేట, ఏప్రిల్ 12 : స్థానిక యెల్లకొండ రెవెన్యూ పరిధిలోని మైతాబ్‌ఖాన్ గూడ సమీపంలో పూడ్చివేసిన నాలాను రెవెన్యూ అధికారులు తిరిగి తవ్వించారు. సర్వే నంబర్ 403లో రైతులకు చెందిన పట్టా భూమిలో నుంచి ఇరిగేషన్ అధికారులు వర్షపు నీరు వెళ్లడానికి నాలా ఏర్పాటు చేశారు. కొంతమంది దానిని పూడ్చివేశారని మైతాబ్‌ఖాన్ గూడ గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన సర్వేయర్, ఏఈ, డీఈలు వచ్చి భూమిని కొలిచిన అనంతరం ఇరిగేషన్ అధికారులు తన సర్వే మ్యాప్‌లో నాలా ఉందని తెలిపారు. నాలాను పూడ్చివేసిన వారే తవ్వాలని అధికారుల సూచన మేర కు మళ్లీ తవ్వారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టాదారులు అగరువాల్, జయరాం మాట్లాడుతూ.. అధికారులు చేసిన సూచనలను తా ము పాటించామని వర్షం వచ్చిన సమయంలో సర్వే నంబర్ 402లో పడిన నీరు కింది భాగంలో ఉన్న సర్వే నంబర్ 403 ద్వారా వస్తుందనే ఉద్దేశంతోనే అధికారులు నాలాను తిరిగి తవ్వించారని గుర్తు జేశారు.

చైన్ స్నాచర్ అరెస్టు

నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు నగలను చూపుతున్న పోలీసులు

కాప్రా, ఏప్రిల్ 12: చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న కారు డ్రైవర్‌ను కుషాయిగూడ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి మూడు బంగారు పుస్తెల తాళ్లు (67 గ్రాములు), బజాజ్ పల్సర్ బైకుతో సహా మొత్తం రూ.5,58,000 విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. హన్మకొండ జిల్లాకు చెందిన పుట్ట హరికృష్ణ ఉపాధి కోసం వచ్చి చెంగిచర్లలో నివాసముంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తాగుడు, గుట్కాలకు అలవాటుపడిన అతడికి ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. డబ్బు కోసం నేరాల బాట పట్టాడు. ఒంటరిగా వెళ్లే మహిళల మెడల్లోనుంచి బంగారు గొలుసులను దొంగిలించడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో అతడు కుషాయిగూడ, కీసర, సైదాబాద్ పోలీసుస్టేషన్ల పరిధిలో మూడు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. అతడిపై నిఘా పెట్టిన పోలీసులు చెంగిచర్లలోని మెరిడియన్ పాఠశాల వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి మూడు బంగారు గొలుసులు, పల్సార్ బైకును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 12: భార్యను వేధిస్తున్న భర్తపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో గృహహింస కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్ కాలనీలోని శాలివాహన నగర్‌లో నివాసముంటున్న కంచర్ల భాగ్యలత (40) బ్యూటీషియన్. ఆమెకు పదేళ్ల కిందట నీహెచ్. లక్ష్మణ్‌తో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. పెళ్లయిన రెండేళ్ల పాటు బాగానే చూసుకున్న లక్ష్మణ్.. ఆ తర్వాత భార్యను రకరకాలుగా వేధించడం మొదలుపెట్టాడు. బ్యూటీషియన్‌గా 14 ఏండ్లుగా పని చేస్తున్న భాగ్యలతను కష్టమర్ల ముందే అవమానించేలా మాట్లాడటం, దూషించడంతో అవకాశాలు సైతం తగ్గిపోయాయి. పలుమార్లు ఆమెను అనుమానించడం, చంపుతానంటూ బెదిరించడంతో పాటు ఎవరికైనా చెబితే కూతుర్ని సైతం చంపేస్తానంటూ హెచ్చరించాడు. అతడి వేధింపులు ఎక్కువ కావడంతోపాటు గత కొన్ని రోజులుగా కులం పేరుతో దూషిస్తూ క్యారెక్టర్ గురించి కూడా చెడుగా ప్రచారం చేస్తుండటంతో విసిగిపోయిన బాధితురాలు ఇటీవల మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన మహిళా పోలీసులు.. ఆ కేసును జూబ్లీహిల్స్ పోలీసులకు బదిలీ చేయడంతో ఇక్కడ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చెట్లు నరికినందుకు..

శామీర్‌పేట, ఏప్రిల్ 12 : అక్రమంగా చెట్లను నరికివేస్తూ.. రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ శాఖ సిబ్బంది సీజ్ చేశారు. శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేట గ్రామ పరిధిలోని కుడి చెరువు కట్టపై కొందరు అక్రమంగా చెట్లను నరికివేస్తూ.. రవాణా చేస్తున్నారు. ఈ ఘటనపై గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న రెవెన్యూ సిబ్బంది వెంకటేశ్, హరికృష్ణ చెట్ల కట్టెలను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని, రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. ఈ విషయంపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కుమార్‌ను వివరణ కోరగా.. రెవెన్యూ సిబ్బంది చెట్లను కొట్టేందుకు ఉపయోగించిన పనిముట్లతో పాటు కట్టెలు, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు తెలిపాడు. అక్రమంగా చెట్లు కొడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బైక్‌పై వెళ్తుంటే.. వెనుక నుంచి వచ్చి చైన్‌స్నాచింగ్

బంజారాహిల్స్, ఏప్రిల్ 12: బైక్‌పై వెళ్తున్న మహిళ మెడలోంచి దుండగులు గొలుసు లాక్కెళ్లారు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 11లో నివాసముంటున్న బండి శ్రీవిద్య శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో తన కుమార్తెను స్కూల్ బస్‌లో ఎక్కించేందుకు బంజారాహిల్స్‌లోని సిటీ సెంటర్ వద్దకు బైక్‌పై బయలుదేరారు. బంజారాహిల్స్ రోడ్ నం. 10లోని యూకో బ్యాంక్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోంచి రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని వేగంగా దూసుకువెళ్లారు. చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దుండగుల వయస్సు సుమారు 20 నుంచి 25 ఏండ్లు ఉంటుందని బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు ఐపీసీ 382 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ర్యాష్ డ్రైవింగ్ వద్దన్నందుకు దాడి

బంజారాహిల్స్, ఏప్రిల్ 12: ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దన్నందుకు ఓ వ్యక్తిని అటకాయించి చితకబాదారు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 14లోని వెంకటేశ్వరనగర్‌లో నివాసముంటున్న చౌహాన్ శ్రీను స్థానికంగా జ్యూస్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 8న రాత్రి అతడు మేనల్లుడు పరమేశ్‌తో కలిసి యాక్టివా బైక్‌పై బంజారాహిల్స్ రోడ్ నం. 14 నుంచి సర్వీ హోటల్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో రెండు కార్లు వేగంగా ఒకదానితో ఒకటి పోటీ పడుతూ ఓవర్‌టేక్ చేసుకునేందుకు యత్నిస్తూ.. బైక్ పైకి వచ్చాయి. దీంతో అంతవేగంగా ఎందుకు వెళ్తున్నారు.. అంటూ శ్రీను ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహానికి గురైన కారులోని వ్యక్తులు జహీరానగర్ సమీపంలో కార్లను ఆపి.. అక్కడికి చేరుకున్న శ్రీనుతో పాటు పరమేశ్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీను, తదితరులు ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి, నిందితుల కోసం గాలిస్తున్నారు.

హైమాస్ట్‌లైట్లు ఏర్పాటు చేయడం అభినందనీయం

కులకచర్ల, ఏప్రిల్ 12 : మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రా మంలో ఎంపీపీ నిధులతో శుక్రవారం హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు మాట్లాడుతూ ముజాహిద్‌పూర్ గ్రామం పెద్ద గ్రామమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు లైట్లను ఏర్పాటు చేసి గ్రామస్తుల సమస్యను పరిష్కరించడం పట్ల ఎమ్మెల్యే కు, ఎంపీపీ సత్యహరిశ్చంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం బాటిళ్ల తరలింపు

టానిక్ యాజమాన్యంతో సహా మరో వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 12: ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ పరిమితికి మించి మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తితో పాటు మద్యాన్ని విక్రయించిన షాపు నిర్వాహకులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లోని ముగ్గా షోరూమ్ సమీపంలో వాహన తనిఖీలు చేస్తున్న జూబ్లీహిల్స్ పోలీసులు అటువైపు వచ్చిన కియా కారును ఆపి పరిశీలించగా.. ఐదు కాటన్ల బీర్ బాటిళ్లు పట్టుబడ్డాయి. పరిమితికి మించి మద్యం తరలిస్తున్న కారు డ్రైవర్ శివ లలిత్‌తో పాటు అతడికి మద్యం విక్రయించిన టానిక్ లిక్కర్ మార్ట్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో సైకో వీరంగం

బంజారాహిల్స్, ఏప్రిల్ 12: మద్యం మత్తులో సైకో వీరంగం సృష్టించాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన సెక్యూరిటీ గార్డును బలంగా కర్రతో కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. వెంకటగిరి నివాసి అనిల్‌కుమార్ జూబ్లీహిల్స్ రోడ్ నం. 5లోని అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిస్తున్నాడు. ఇందిరానగర్ నివాసి సైకో అయిన అల్లూరు శ్రీకాంత్ (30) గురువారం రాత్రి స్టూడియో వద్దకు వచ్చాడు. స్టూడియోలోకి అనుమతించాలని, సూపర్‌వైజర్‌ను కలుస్తానంటూ గట్టిగా కేకలు పెడుతూ గేటువద్ద న్యూసెన్స్‌కు పాల్పడ్డాడు. ఈ సమయంలో లోపల ఎవరూ లేరని, ఉదయం పూట రావాలని సెక్యూరిటీ గార్డు అనిల్‌కుమార్‌తోపాటు మరో సెక్యూరిటీ గార్డు చెప్పి గేట్లు మూశారు. దీంతో శ్రీకాంత్ పెద్ద పెద్ద బండరాళ్లు తీసుకొచ్చి స్టూడియో గేట్లపై విసిరాడు. దీంతో బయటకు వచ్చిన అనిల్‌కుమార్‌ను తీవ్ర పదజాలంతో దూషించిన శ్రీకాంత్.. పెద్ద కర్రతో దాడి చేశాడు. అనిల్‌కుమార్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. అతడిని అమీర్‌పేటలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెలిపారు. శుక్రవారం బాధితుడి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. నిందితుడు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు గతంలో కూడా పలువురిపై దాడులకు పాల్పడి, అరెస్టయినట్లు విచారణలో తేలింది.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

దోమ, ఏప్రిల్ 11 : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దిర్సంపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త లక్ష్మీనారాయణగౌడ్‌ను ఆయన పరామర్శించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొంది స్వగ్రామానికి చేరుకున్న లక్ష్మీనారాయణగౌడ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మనోధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నాగిరెడ్డివైస్ ఎంపీపీ మల్లేశం, మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, స్థానిక ఎంపీటీసీ నవాజ్‌రెడ్డి, నాయకులు హైమద్, ఖాజా, హన్మంతునాయక్ పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

కులకచర్ల, ఏప్రిల్ 12 : బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసానికి జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని జిల్లా జేఏసీ నాయకుడు ముకుంద నాగేశ్వర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు మాసయ్య, ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లింగ్.. ఇద్దరి అరెస్ట్

నిఘా పెట్టి పట్టుకున్న సైబరాబాద్ ఎస్ఓటీ పోలీస్

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ఒడిశా కేంద్రంగా నగరానికి గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తితో పాటు నగరంలో గంజాయి విక్రయిస్తున్న మరో వ్యక్తిని సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 20 వేల విలువజేసే రెండు కిలోల గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన కైబర్త గిరిధారి (38) హమాలి. సులభంగా డబ్బు సంపాదించేందుకు గంజాయి స్మగ్లింగ్‌ను ఎంచుకున్నాడు. 2009 నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు తన స్వస్థలం నుంచి గంజాయి సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలోనే నగరంలోని తిరుమలగిరి ప్రాంతానికి చెందిన నల్ల రోహిత్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. రోహిత్ స్థానికంగా గంజాయి విక్రయిస్తుంటాడు. రోహిత్‌కు సైతం గిరిధారి రూ.10 వేలకు కిలో చొప్పున గంజాయి సరఫరా చేస్తున్నాడు. ఇందులో భాగంగానే రోహిత్ కుమార్ నుంచి రూ.10 వేలు అడ్వాన్స్‌గా తీసుకున్న గిరిధారి, ఇటీవలె ఒడిశాకు వెళ్లి, అక్కడ కిలో రూ.2,500 చొప్పున రెండు కిలోల గంజాయి కొనుగోలు చేసి, నగరానికి తీసుకొచ్చాడు. అనంతరం శుక్రవారం ఉదయం మేడ్చల్, రేకుల బావి చౌరస్తా వద్ద గంజాయిని రోహిత్‌కు అందజేస్తుండగా అప్పటికే సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు నిఘా పెట్టి నిందితులిద్దరినీ పట్టుకుని, అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం కేసును మేడ్చల్ పోలీసులకు అప్పగించారు.

వాహనం ఢీ.. వ్యక్తి మృతి

కొడంగల్, ఏప్రిల్ 12: రోడ్డు దాటు తుండగా వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రావుల పల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. రావులపల్లికి చెందిన నర్సప్ప (50) శుక్రవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకు నేందుకు హైవే రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్ణాటక వైపు వెళ్తున్న టాటాఎస్ వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన నర్సప్పను కొడంగల్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా డాక్టర్ పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. డ్రైవర్ నిర్ల క్ష్యంగా వాహనాన్ని అతి వేగంగా నడుప డంతోనే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి కుమారుడు తలారీ అశోక్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
FINANCIAL SERVICES
★రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నొవా ఫైనాన్స్. ఫోన్: 7696660523.
NT-311979_All
WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన